ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 35.0 | కనిష్ఠం : 21.0
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
సోమవారం 17 ఫిబ్రవరి 2025





విల్లు ఎక్కుపెట్టిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పేరుకే పెంపు

ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వసతులు కరువు

- రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో దవాఖానాల అప్‌గ్రేడ్, భవనాల నిర్మాణం
- కొన్నింటి నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం
- ఆ మేరకు చేపట్టని డాక్టర్లు, పారామెడికల్, నాన్ మెడికల్ స్టాఫ్ నియామకాలు
- వేధిస్తున్న డాక్టర్ల కొరత, కాంట్రాక్టు పద్ధతిలోనూ రిక్రూట్ చేయని దుస్థితి



అచ్చంపేటలోని ఏరియా ఆస్పత్రి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వైద్య సేవలను విస్తృతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లాకు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా జిల్లా ఆసుపత్రులను జనరల్ ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేసింది. నియోజకవర్గ కేంద్రాల్లో 100 పడకల ఆస్పత్రులను నిర్మించాలని సంకల్పించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఏరియా ఆసుపత్రులుగా, పలు కీలకమైన మండలాల్లో పీహెచ్‌సీలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసింది. వాటికి అనుగుణంగా కొత్త భవనాలను కూడా నిర్మించింది. ఇంకా కొన్ని నియోజకవర్గాల్లో ఏరియా ఆసుపత్రులు మంజూరు కావాల్సి ఉంది. అయితే ఇప్పటికే జనరల్ ఆసుపత్రుల్లో చాలా విభాగాలకు డాక్టర్ల కొరత ఉన్న విషయం తెలిసిందే. అప్‌గ్రేడ్ చేసిన ఏరియా ఆసుపత్రులు, మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లో కూడా ఇప్పటివరకు సిబ్బంది కేటాయింపులు లేకపోవడంతో సేవలు అందడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 71 ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో 7050 పడకలు అందుబాటులో ఉన్నాయి. ఈ 71 ఆసుపత్రుల్లో చాలావరకు గత ప్రభుత్వ హయాంలో అప్‌గ్రేడ్ అయినవే. మదర్ అండ్ చైల్డ్ హెల్త్‌కు సంబంధించి 15 ఆసుపత్రులు ఉండగా, 1100 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 24 ఉండగా అందులో 1200 బెడ్లు, 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 66 ఉండగా 1980 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. ఏరియా, ఎంసీహెచ్, సీహెచ్‌సీలు కలిపి మొత్తం 186 ఆసుపత్రులు, 11330 బెడ్లు ఉన్నట్లు వైద్య విధాన పరిషత్ గణంకాలు చెబుతున్నాయి. కానీ, మెజారిటీ ఆసుపత్రుల్లో డాక్టర్లు, పారామెడికల్, నాన్‌మెడికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నది. ఆయా ఆసుపత్రులు అప్‌గ్రేడ్ చేసినా దానికి అనుగుణంగా కేటాయింపులు చేయలేదు.

స్టాఫ్ ప్యాటర్న్ ఇలా..

ఏదైనా ఏరియా ఆసుపత్రికి టీవీవీపీ నిబంధనల ప్రకారం 100 పడకలు ఉంటే అందులో 9 మంది సివిల్ సర్జన్లు, ఒక ఆర్ఎంఓ, సివిల్ సర్జన్ (డెంటల్) ఒకరు, డిప్యూటీ సివిల్ సర్జన్లు నలుగురు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 23 మంది, డెంటల్ అసిస్టెంట్ సర్జన్, నర్సింగ్ సూపరింటెండెంట్, ఏఓ, ఫార్మసీ సూపర్‌వైజర్, నలుగురు హెడ్ నర్సులు, ఆఫీసు సూపరింటెండెంట్, 26 మంది స్టాఫ్ నర్సులు, ముగ్గురు ఫార్మాసిస్టులు, ఫిజియోథెరపిస్టు, రేడియోగ్రాఫర్లు ఇద్దరు, సీనియర్ అసిస్టెంట్లు ఇద్దరు, నలుగురు ల్యాబ్ టెక్నిషియన్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, జూనియర్ అసిస్టెంట్లు, ఓటీ అసిస్టెంట్లు కలిపి దాదాపు 98 మంది పనిచేయాలి. కొన్ని ఆసుపత్రుల్లో అవసరానికి తగ్గట్టుగా వందమందికి పైగా పనిచేయాల్సి ఉన్నది. కానీ, అప్‌గ్రేడ్ చేసిన ఏ ఏరియా ఆస్పత్రిలోనూ ఆ మేరకు నియామకాలు జరగలేదు. అంతకుముందు ఉన్న గ్రేడ్‌లో పనిచేస్తున్నవారే ఉన్నారు. అందులో కూడా ఖాళీలు ఉన్నాయి. ఇక ఉండాల్సిన డాక్టర్లలో కూడా వివిధ విభాగాల వారు ఉండాలి. విభాగాల వారీగా కాకుండా ఇష్టారీతిన నియామకాలు ఉన్నాయి. ఇక 30 పడకల సీహెచ్‌సీలో ఓపీని బట్టి 30 నుంచి 50 వరకు పోస్టుల వరకు ఉండాలి. అక్కడ కూడా పీహెచ్‌సీ స్థాయిలోని సిబ్బంది ఉన్నారు. దీనివల్ల పేరుకు పడకలు పెంచి కొత్త భవనాలు నిర్మించినా సేవల విస్తృతి మాత్రం పెరగలేదు.



వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్

నిర్మించినా నిరుపయోగం

ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేసి

(మిగతా 6లో..)

106 మందికి 44 మందే..

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సీహెచ్‌సీని గత ప్రభుత్వ హయాంలో ఏరియా ఆస్పత్రిగా మార్చారు. 30 పడకలను 100 పడకలకు పెంచారు. అధునాతన సౌకర్యాలతో కొత్త భవనం కూడా నిర్మించారు. ఇందులో కేడర్ స్ట్రెంత్ 26 విభాగాలకు సంబంధించి 106 మంది పని చేయాలి. డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్, నాన్ మెడికల్ స్టాఫ్ అంతా ఇందులో వస్తారు. కానీ, ఇప్పటివరకు అక్కడ 44 మంది మాత్రమే పని చేస్తున్నారు. సివిల్ సర్జన్ పోస్టులు తొమ్మిది కాగా ఒక్కరే పనిచేస్తున్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 23 మంది కాగా, ఐదుగురు మాత్రమే పనిచేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ స్టాఫ్ నర్సులను నియమించడంతో వారి సంఖ్య 26కు గాను 23 ఉంది. మొత్తం పోస్టుల్లో సగం వీరే ఉన్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇదే నియోజకవర్గంలోని బాలానగర్ పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా మార్చగా 49 మంది కేడర్ స్ట్రెంత్‌కు గాను కేవలం 18 మంది పనిచేస్తున్నారు. 31 ఖాళీలు ఉన్నాయి. ఇప్పుడు ఉన్న సిబ్బంది కూడా పీహెచ్‌సీ వారే.

కేడర్ స్ట్రెంత్ కావాలి



అలంపూర్ చౌరస్తాలో సీహెచ్‌సీ, ఎంసీహెచ్ రెండూ ఉన్నాయి. మొత్తం వంద పడకల సామర్థ్యం ఉన్నది. భవన నిర్మాణం పూర్తయ్యి అందుబాటులో ఉన్నది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని వసతులను అక్కడ కల్పించాం. కానీ, ప్రభుత్వం నుంచి ప్రత్యేక కేడర్ స్ట్రెంత్ రాలేదు. తాత్కాలికంగా కొంత మందిని పంపించినా అక్కడ సేవలు అందించడం సాధ్యం కాదు. ప్రభుత్వమే టీవీవీపీ కింద బడ్జెట్, కేడర్ స్ట్రెంత్‌ను ఇవ్వాలి. అప్పుడే అలంపూర్ ఆస్పత్రిలో సేవలు ప్రారంభమవుతాయి.

- డాక్టర్ వినోద్‌కుమార్, సూపరింటెండెంట్, గద్వాల ఆస్పత్రి

మహబూబ్‌నగర్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ముగిసిన మన మహబూబ్‌నగర్ మహా నగరోత్సవాలు
- వేలాదిగా తరలొచ్చిన నగర ప్రజలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహబూబ్‌నగర్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన మన మహబూబ్‌నగర్ మహా నగరోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలను 22 వేల మంది ప్రజలు సందర్శించారన్నారు. చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు ఇది చక్కని వేదిక అని చెప్పారు. చివరి రోజు ఆదివారం విద్యా సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉండటంతో ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భరతనాట్యం, కూచుపూడి, బంజారా నృత్యం, మ్యాజిక్ షోలు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన గేమ్‌షో అలరించాయి. శనివారం ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ముందు జాగ్రత్తగా బైక్‌లను, కార్లను ట్యాంక్ బండ్‌పైన ఖాళీ స్థలంలో పార్క్ చేయించారు. కాలినడకన వచ్చిన వారిని మాత్రమే శిల్పారామంలోకి అనుమతించారు. మూడు రోజులుగా సహకరించిన పోలీసులకు, మునిసిపల్ శాఖ అధికారులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం
- 12 గంటల్లో 11 మందిపై దాడి
- నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఘటనలు
7

కృష్ణానదిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి
- కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ శివారులో ఘటన
7

ఫీజులుం
- విద్యార్థులపై ప్రైవేటు విద్యా సంస్థల ఒత్తిడి
7

బయో మైనింగ్‌తో చెత్త శుద్ధి



చెత్తను వేరు చేసే బయో మైనింగ్ యంత్రం

- పాలమూరు కార్పొరేషన్‌లో ప్రతీ రోజు 106 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ
- రోజూ 30 మెట్రిక్ టన్నుల విభజన
- సేకరణకు 45 స్వచ్ఛ ఆటోలు.. 19 ట్రాక్టర్లు.. కొత్తగా మరో 20 ఆటోల కొనుగోలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): పాలమూరు నగరపాలక సంస్థలో ప్రతీ రోజూ సగటున 106 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇంటింటికి తిరిగి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. సేకరించిన చెత్తను కోయిల్ సాగర్ ఎక్స్ రోడ్డు సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మాత్రు ఏజెన్సీ ద్వారా చెత్తను శుద్ధి చేసేందుకు బయో మైనింగ్ చేస్తున్నారు. చెత్తను శుద్ధి చేసి, జీవ ఎరువును తయారుచేసే ప్రక్రియను చేపడుతున్నారు. రోజూ 20-30 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేస్తున్నారు. బయోమైనింగ్ ద్వారా చెత్తను సెగ్రిగేషన్ చేస్తున్నారు. ఇందులోంచి రకరకాల చెత్తను వేరు చేస్తున్నారు. ప్లాస్టిక్, బ్లాక్ సాయిల్, ఇసుక, కంకర, క్లాత్ వంటి చెత్తను వేరు చేస్తున్నారు. రీసైక్లింగ్‌కు అవసరమైన చెత్త ఉంటే రీసైక్లింగ్‌కు ఉపయోగిస్తున్నారు. రీసైక్లింగ్ చేసిన చెత్త ఎరువుగా ఉపయోగపడితే పట్టణంలో నాటిన హరితహారం మొక్కలకు ఉపయోగించనున్నారు. పెద్ద పెద్ద ప్లాస్టిక్ బాటిళ్లు, దుస్తులు లాంటివి మొదటి దశలో బయటకు వస్తాయి. ఆ తరువాత చిన్న సైజులో ఉండే వ్యర్థాలు బయటకు వస్తాయి. వీటిని సిమెంట్ పరిశ్రమలో ఉపయోగిస్తారు. ఇసుక, కంకరను అభివృద్ధి పనుల కోసం వెచ్చించనున్నారు. ఇలా బయోమైనింగ్ ద్వారా చెత్తను శుద్ధి చేసే ప్రక్రియను 20 రోజులుగా చేపడుతున్నారు.

స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త తరలింపు

కార్పొరేషన్ పరిధిలో 49 వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం 45 స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తున్నారు. ప్రతీ వార్డుకు ఒక ఆటోను కేటాయించారు. వాళ్లే ఆటోను మెయింటెన్ చేసుకుని ప్రతీ ఇంటినుంచి రూ.40-50 తీసుకుంటారు. ఇలా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తారు. వీటితోపాటు ఇటీవలే మరో 20 కొత్త స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేశారు. తొందరలోనే ఇవి కూడా వినియోగంలోకి రానున్నాయి. డ్రైవర్లను నియమించి, వారికి ఏరియాలను కేటాయించనున్నారు. వీటితోపాటు పురపాలికకు చెందిన తొమ్మిది ట్రాక్టర్లు, ప్రైవేట్‌కు చెందిన 10 ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ చేస్తున్నారు. ప్రైవేట్ ట్రాక్టర్ ఒక్కో దానికి నెలకు కార్పొరేషన్ నుంచి రూ.1.05 లక్షలు చెల్లిస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కు డ్రైవర్‌తోపాటు నలుగురు సిబ్బంది ఉంటారు. వాళ్ల జీతాలతోపాటు డీజిల్ ఖర్చు కలిపి ఈ డబ్బు చెల్లిస్తున్నారు. ఇలా నగరంలో ప్రతీరోజు సగటున 106 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు.



మహబూబ్‌నగర్ సమీపంలోని డంపింగ్ యార్డు

టెన్త్ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



పవన్‌కుమార్ నాయుడు (ఫైల్)

ఎర్రవల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఉన్న పదో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్ నాయుడు (36) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నంద్యాల జిల్లా, పగిడ్యాల గ్రామానికి చెందిన పవన్‌కుమార్ నాయుడు (2013 బ్యాచ్, పీసీ నెంబర్ 1203) బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులు హాల్‌లో ఉన్న సమయంలో, బెడ్ రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఆయన ఆత్మహత్య పట్ల బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య, సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

వన్ టైం సెటిల్‌మెంట్‌తో పరిహారం ఇవ్వాలి

- పాలమూరు బిడ్డగా ఉదండాపూర్ నిర్వాసితులకు సీఎం న్యాయం చేయాలి
- నిర్వాసితుల రిలే దీక్షలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎంపీ అరుణ

జడ్చర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు వన్ టైం సెటిల్‌మెంట్‌తో పరిహారం ఇవ్వాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామ సమీపంలో రిజర్వాయర్ నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షల్లో ఆదివారం ఆమె పాల్గొన్నారు. వారికి మద్దతు తెలిపి, మాట్లాడారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి ధరలను నేడు ఇస్తామంటే ఎవరూ ఒప్పుకోరన్నారు. టెండర్ దక్కించుకుని పని చేయని కాంట్రాక్టర్ స్థానంలో రీ టెండర్ వేసి, కొత్త రేట్లతో పనులు చేయించి డబ్బులు ఇస్తారు కదా? అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇస్తే పర్సంటేజీలు వస్తాయని డబ్బులు ఇస్తున్నారని, అదే నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తే పర్సంటేజీలు రావని ఇవ్వడంలేదని ఎద్దేవా చేశారు. పాలమూరు బిడ్డను అని గొప్పగా చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మొట్టమొదటగా ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. రూ.25 లక్షల ప్యాకేజీ ఇస్తామన్న హామీ మేరకు చెల్లించాలని కోరారు. నోటిఫికేషన్ జారీ చేసిన తేదీని కాకుండా ప్రస్తుతం 18 సంవత్సరాల వయస్సును పరిగణలోకి తీసుకుని పరిహారం ఇవ్వాలన్నారు. పరిహారం చెల్లించిన అనంతరం ప్రాజెక్ట్ పనులు చేపట్టాలన్నారు. పరిహారం ఇవ్వకుండా మోసం చేస్తారేమో అన్న భయంతో నిర్వాసితులు ఉంటే, ఎమ్మెల్యేకు కోపం ఎందుకు అని ప్రశ్నించారు. నిర్వాసితులను సీఎం క్యాంపు ఆఫీస్‌కు పిలిపించుకుని, వన్ టైం సెటిల్‌మెంట్‌తో పరిహారం చెల్లించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. సొంత జిల్లా రైతుల సమస్యలను తీర్చలేని వాడు, రాష్ట్ర రైతాంగం సమస్యలను ఏం పరిష్కరిస్తాడని ఎద్దేవా చేశారు. నిర్వాసితుల అంశంపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలంటూ మంత్రిని అడిగినా నేటికీ సమయం ఇవ్వడం లేదని, మరో పర్యాయం సమయం ఇవ్వాలని అడుగుతానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, ముచ్చర్ల కృష్ణయ్య, బుక్క నవీన్, సామల నర్సిములు, అమర్‌నాథ్‌గౌడ్, రమేశ్‌జీ, శివశంకర్‌రెడ్డి, మోహన్ నాయక్, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో ఇరిగేషన్‌శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యలను వెల్లడిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

పునరావాసం ఫైలు పరిశీలనలో ఉంది

(వార్త 7వ పేజీలో..)

- త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ
- హైదరాబాద్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

భారీ మొసలి పట్టివేత



మొసలిని తాళ్లతో బంధిస్తున్న స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్, సభ్యులు

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి గ్రామంలో ఆదివారం భారీ మొసలిని రైతులు, గ్రామస్థులు పట్టుకున్నారు. గ్రామ సమీపంలోని మోడల నరసింహ వరి పంటకు నీరు పెట్టేందుకు బోర్ మోటర్ ఆన్ చేయానికి వెళ్లాడు పొలంలో ఉన్న భారీ మొసలిని చూసి భయపడి ఊళ్లోకి వచ్చి, గ్రామస్థులకు తెలిపాడు. స్నేక్స్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణ సాగర్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పెద్ద తాళ్ల సహాయంతో మొసలిని బంధించారు. దానిని తీసుకెళ్లి కృష్ణానది పరిసర ప్రాంతంలో వదిలి పెట్టారు. ఎండకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెరువులు, కాలువల్లో నీళ్లు తగ్గడంతో మొసళ్లు సమీప పంట పొలాల్లోకి, గ్రామాల్లో చొరబడుతున్నాయి. దాంతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

పేరుకే పడకల పెంపు



జడ్చర్ల ఏరియా ఆస్పత్రి

(5వ పేజీ తరువాయి)

కొన్ని చోట్ల అదే ఆసుపత్రుల సముదాయంలో కొత్త భవనాలను నిర్మించడం లేదా, ప్రజలకు అనుగుణంగా ఉండే విధంగా మరో చోట కొత్త భవనాల నిర్మాణాన్ని గత ప్రభుత్వ హయాంలో చేశారు. దాదాపు వందల కోట్లు ఖర్చు చేసి ఈ నిర్మాణాలు చేశారు. కొన్నిచోట్ల అసలు నిర్మాణాలే చేపట్టకుండా వాటిని అప్‌గ్రేడ్ చేసినట్లు అధికారిక గణంకాల్లో పొందుపరిచారు. కానీ, ఇప్పటివరకు అప్‌గ్రేడ్ అయిన మేరకు స్టాఫ్ కేటాయింపులు లేవు. ఉదాహరణకు అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి అలంపూర్ క్రాస్ రోడ్డు వద్ద 100 పడకలతో భారీ భవనాన్ని నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలోనే ఎన్నికల సమయంలో ఈ భవనాన్ని ప్రారంభించారు. ఇందులో 50 పడకలు ఎంసీహెచ్ కింద, 50 పడకలు ఏరియా ఆసుపత్రి కింద వైద్యవిధాన పరిషత్ నియంత్రణలో ఉన్నాయి. కానీ, ఈ రోజు వరకు కూడా అక్కడ వైద్యసేవలు అందించడం లేదు. జడ్చర్ల, అచ్చంపేట, దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల్లో నిర్మించిన ఏరియా ఆసుపత్రుల పరిస్థితి కూడా ఇలాగే ఉన్నది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గత ప్రభుత్వ హయాంలో పేరుకు అప్‌గ్రేడ్ చేశారు కానీ, స్టాఫ్‌ను కేటాయించాలని చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు ఆ దిశగా వైద్య విధాన పరిషత్ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సేవలు అందకపోవడంతో ఫర్నిచర్ చోరీ, యంత్రాలు పనికిరాకుండా తయారవుతున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో డిప్యూటేషన్‌పై కొంతమంది డాక్టర్లను కేటాయించినప్పటికీ సేవలు నామమాత్రంగానే ఉంటున్నాయి. అప్‌గ్రేడ్ చేసిన 100 పడకల ఆసుపత్రుల్లో ఇంకా 30 పడకల ఆస్పత్రి సిబ్బందితోనే పనులు చేయించుకోవాల్సిన దుస్థితి ఉన్నది.



ఓపీ సేవల కోసమేనా?

వనపర్తి జిల్లా ఖిల్లాగణపురంలో సీహెచ్‌సీ నిర్మించారు. ఆసుపత్రిలో జనరల్ సర్జన్లు, గైనకాలజిస్టులు ఇతర విభాగాలకు సంబంధించిన వారు ఉండాలి. కానీ, ఇక్కడ ఓపీ సేవలు మాత్రమే అందుతున్నాయి. శస్త్రచికిత్సలు జరగడం లేదు. కేంద్రం 24 గంటలు అందుబాటులో ఉండాలి. కానీ, అలాంటి సేవలు అందడం లేదు. ఉదయం వేళ వచ్చి ఓపీ సేవలు చూసుకుని డాక్టర్లు వెళ్లిపోతున్నారు. రాత్రి వేళల్లో వచ్చే రోగులకు సీహెచ్‌సీలో డాక్టర్లు ఉండకపోవడం దారుణం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కంటే సీహెచ్‌సీల్లోనే పరిస్థితి దారుణంగా ఉన్నది. అధికారులు సీహెచ్‌సీలు నిర్మించి డాక్టర్లను నియమించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- కమ్మరి గోపి, సామాజిక కార్యకర్త, ఖిల్లాగణపురం

● నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో కూడా ఒక ఏరియా ఆస్పత్రి నిర్మించారు. ఇందులో 26 మంది అసిస్టెంట్ సివిల్ సర్జన్లకు ఇద్దరు, 10 మంది డిప్యూటీ సివిల్ సర్జన్లకు ఒక్కరూ లేరు. 9 మంది సివిల్ సర్జన్లకు గాను ఎనిమిది మంది ఉన్నారు. అత్యంత కీలకమైన గైనకాలజిస్టు లేరు. రెడియాలజిస్టు కూడా లేరు. 75 మంది ఇతర సిబ్బంది కావాలి. కానీ, 34 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ ఆసుపత్రికి కేటాయింపులు చాలా అవసరం. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలో 30 పడకల సీహెచ్‌సీని నిర్మించారు. ఇక్కడ పదిమంది డాక్టర్లకు గాను ఐదుగురు ఉన్నారు. అందులో కూడా ఇద్దరు దంత వైద్యులే. ముగ్గురు మాత్రమే ఓపీ చూస్తున్నారు. మిగతా సిబ్బంది కూడా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఈ ఆస్పత్రి మొత్తానికి రెగ్యులర్ ఉద్యోగి ఒక్కరే ఉండటం ఆశ్చర్యం. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ క్రాస్ రోడ్డులో 100 పడకల ఆస్పత్రిని నిర్మించారు. ఇక్కడ ఇప్పటివరకు ఒక్క వైద్యుడిని కూడా కేటాయించలేదు. కేడర్ స్ట్రెంత్ కూడా లేదు. ఎన్నికల ముందు భవనం ప్రారంభించినా నేటికీ సేవలు ప్రారంభం కాలేదు.

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి

నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నార్కోటిక్స్ స్నైపర్ జాగిలంతో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవాణా చేపట్టకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కిరాణ దుకాణాలు, అనుమానంగా ఉన్న పొలాలు, కొరియర్ కేంద్రాల్లో తనిఖీలు చేశామన్నారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటివి వినియోగిస్తున్నా, సరఫరా చేస్తున్నట్లు తెలిసిన వెంటనే 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.



అప్పక్‌పల్లి వద్ద దుకాణాన్ని జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలింగ్ కేంద్రాల జబితా ప్రదర్శన

● జిల్లాలో 922 ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ కేంద్రాలు



జడ్పీలో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పంచాయతీ డైరెక్టర్ సృజన ఆదేశాల మేరకు జిల్లాలోని 16 మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు ప్రదర్శించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ కేంద్రాలు 922 ఉండగా, 5,05,833 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళా ఓటర్లు 2,54,134 ఉండగా, పురుష ఓటర్లు 2,51,691, ఇతర ఓటర్లు 8 ఉన్నారు. అడ్డాకుల మండలంలో 43 పోలింగ్ కేంద్రాలు ఉండగా, బాలానగర్ మండలంలో 65, భూత్పూర్ మండలంలో 49, చిన్నచింతకుంట మండలంలో 54, దేవరకద్ర మండలంలో 44, గండీడ్ మండలంలో 59, హన్వాడ మండలంలో 67, జడ్చర్ల మండలంలో 77, కోయిల్‌కొండ మండలంలో 92, కౌకుంట్ల మండలంలో 34, మహబూబ్‌నగర్ మండలంలో 66, మిడ్జిల్ మండలంలో 46, మహ్మదాబాద్ మండలంలో 61, మూసాపేట మండలం లో 41, నవాబ్‌పేట మండలంలో 84, రాజాపూర్ మండలంలో 40 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో అధికారులు జాబితాను కార్యాలయ ఆవరణలో ప్రదర్శించారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే ప్రదర్శన

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే పోలింగ్ కేంద్రాల తుది జాబితను శనివారం జిల్లాలోని 16 మండల కేంద్రాలతో పాటు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఆర్‌వోలు, ఏఆర్‌వోల నియామకం, శిక్షణ పూర్తయింది. మండల స్థాయిలో ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్స్ సిద్ధంగా ఉన్నారు. నూతన ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. జడ్పీ సీఈవోకు, జిల్లా పంచాయతీ అధికారికి నూతనంగా ఓటు నమోదు చేయడం, తీసివేసే అధికారం ఉండదు.

- జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ఫారుక్ హుస్సేన్

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్‌మేవా) రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ఫారుక్ హుస్సేన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇంతకు వరకు పరిష్కరించకపోవడం సరికాదన్నారు. వెంటనే పెండింగ్ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అయూబ్, అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర కార్యదర్శి షేక్‌ఫరీద్, సంఘ సభ్యులు నిజాముద్దీన్, సిరాజ్‌ఖాన్, ముఖ్తర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె పెళ్లి పత్రికలో ఎన్‌టీఆర్ ఫొటో

● అభిమానం చాటుకున్న చిన్నదర్పల్లికి చెందిన రాజు



పెళ్లి కార్డుపై ఎన్టీఆర్ ఫొటో

హన్వాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తె పెళ్లి పత్రికలో సినీ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ చిత్రాన్ని ముద్రించి స్నేహితులు, బంధువులకు ఇచ్చి తన అభిమానాన్ని చాటుకున్నాడు. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలోని చిన్నదర్పల్లి చెందిన బోయ రాజు చిన్ననాటి నుంచి జూనియర్ ఎన్‌టీఆర్ అభిమాని. ప్రస్తుతం జూనియర్ ఎన్‌టీఆర్ అభిమాన సంఘం మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య సలహాదారుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 23న తన కుమార్తె భవ్యశ్రీ (శ్రావణి) వివాహం ఉంది. ఈ సందర్భంగా ఆమె పెళ్లి పత్రికలో జూనియర్ చిత్రాన్ని ముద్రించి అభిమానాన్ని చాటుకున్నారు పెళ్లికి ఎన్‌టీఆర్‌ను ఆహ్వానించేందుకు సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్‌తో కలిసి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.



చిన్నప్పుడు ఎన్‌టీఆర్‌తో ఫొటో దిగిన బోయరాజు కుమార్తె శ్రావణి

ప్రపంచానికి మార్గదర్శనం ఖురాన్

- మాతృభాషలో ఖురాన్ అనువాదం చదవాలి
- మౌలానా ఖాజీ హాఫీజ్ అల్లా అమీర్ షర్ఫీ



అరబీ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న మౌలానా ఖాజీ అహఫీజ్

కందనూలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శనమని, శాస్త్ర సాంకేతిక రంగాల భాండాగారం ఖురాన్ అని జామే నిజామియా అరబ్బీ యూనివర్సిటీ మౌలానా ఖాజీ హఫీజ్ అల్లా అమీర్ షర్ఫీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మదర్సా ఇసామియా ఫజల్-ఉల్-ఉలూమ్ అరబీ పాఠశాల 30వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక బోధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన సమగ్ర సమాచారం పవిత్ర ఖురాన్‌లో ఉందన్నారు. నేడు ప్రపంచంలోని శాస్త్రవేత్తలు అందరూ ఖురాన్‌లో ఉన్న అంశాలను సమగ్రంగా అధ్యయనం చేస్తూ విజయం సాధిస్తున్నారని ఆయన అన్నారు. ప్రతీ ఒక్కరు తమ తమ మాతృభాషలో అనువదించిన పవిత్ర ఖురాన్‌ను విధిగా చదవా లని పిలుపునిచ్చారు. భూమి మీద జీవించే ప్రతీ ప్రాణి గురించి ఖురాన్‌లో ఉందన్నారు. సర్వ మానవాళికి అవసరమైన సమాచారంతో పాటు మనిషి నడవడిక ఎలా ఉండాలి అన్నది అందులో పొందుపరచారని పేర్కొన్నారు. తమ పిల్లలను మదరసాల్లో చేర్పించి ఖురాన్‌కు కంఠస్తం చేయించి హాఫీజ్‌లుగా ఎదిగేలా చేయడంతో పాటు మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో అల్లాను ప్రార్థించి ముందుకు పోయినట్లయితే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి సయ్యద్ రఫియొద్దీన్, ముషా విరత్ కమిటీ ఉపాధ్యక్షుడు, మిలాద్ కమిటీ అధ్యక్షుడు షేక్ యాకుబ్ బావజీర్, హాఫీ జ్ మహమ్మద్ ఇర్షాద్ అలం, అబ్దుల్లాఖాన్, కమిటీ సభ్యులు ముస్తాక్ అహ్మద్, అబ్దుల్ అలీం, మహమ్మద్ యూసుఫ్, సయ్యద్ అహ్మద్, ఇస్మాయిల్ ఖాన్, మహమ్మద్ ఖాజా, ఆరీఫ్ హుస్సేన్, సమద్, మునవ్వర్, తాహెర్ పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దమందడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిలకటోనిపల్లి గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్నటువంటి పెద్దమందడి హెడ్ కానిస్టేబుల్ దామోదర్, కానిస్టేబుల్స్ రవీందర్‌నాయక్, చంద్రశేఖర్, జగదీష్, సిబ్బంది పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు ముమిళ్ల శివకృష్ణ, ఓనర్ బాజా, జానకిరాములుపై ఏపీ 226760 డ్రైవర్ ముమిళ్ల రాములు, ఓనర్ ముమిళ్ల రాములుపై టీఎస్ 32బి0894, డ్రైవర్ జమ్ములు ఆంజనేయులు, ఓనర్ బాజా శ్రీనులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తె లిపారు. అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

పెద్దమందడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్వాల గ్రామ రైతుల పొలంలో ఆదివారం కుక్కల దాడిలో దుప్పి మృతి చెందింది. అటు వైపు వెళ్తున్న సోలార్‌కు సంబంధించిన కార్మికులు చూసి ఫారెస్టు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫారెస్టు సిబ్బంది సెక్షన్ ఆఫీసర్ నరేష్, బీట్ ఆఫీసర్ వంశీలు సంఘటన స్థలానికి చేరుకొని చుక్కల దుప్పిని పెద్దమందడి వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు కుక్కల దాడిలో మృతి చెందిందని నిర్ధారించారు. మృతి చెందిన దుప్పిని ఫారెస్టు అధికారులు ఖననం చేశారు. రైతులు అడవి జంతువులకు సంబంధించిన ఏమైనా సంఘటనలు జరిగితే తమకు తెలియజేయాలని ఫారెస్టు అధికారులు సూచించారు.

తెగుళ్లతో కుదేలైన వేరుశనగ రైతు



పాపగల్ గ్రామంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంట

తాడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్లుగా వేరుశనగ సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాదైనా వాతావరణం కలిసొచ్చి దిగుబడి పెరిగి లాభాలు వస్తాయనే ఆశతో యాసంగిలో నాగర్ కర్నూల్ జిలా వ్యాప్తంగా 1,20,290 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. విత్తనాలు విత్తినప్పటి నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా తెగుళ్ల సోకాయి. దీంతో పంట ఎదుగుదల లేక మొక్కలు ఎండిపోయాయి. వేరుకుళ్లు తెగుళ్ల కారణంగా మొక్కకు ఆశించినంత మేర కాయలు పట్టకపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. సాధారణ ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో 3 నుంచి 6క్వింటాళ్లలోపు మాత్రమే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ధర కూడా లేకపోవడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వేరుశనగకు కనిష్టంగా రూ.4500ల నుంచి గరిష్టంగా రూ.6 వేల లోపు మాత్రమే ధర పలుకుతోంది. గతంలో రూ.6వేల నుంచి రూ.8వేలకు పైగా ధర పలికేదని అన్నదాతలు వాపోతున్నారు. ఎకరాకు రూ.30 నుంచి రూ.40వేల ఖర్చు వెచ్చించి పంట సాగు చేస్తే రూ.15 వేల నుంచి 20వేల వరకు మాత్రమే వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. మొత్తంగా వేరుశనగ సాగు చేసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

ఇలాంటి పరిస్థితిని చూడలేదు



నాలుగైదు సంవత్సరాల నుంచి వేరుశనగ సాగులో ఇలాంటి విపత్కర పరిస్థితిని చూడలేదు. నేను నాతోపాటు మరో ఇద్దరం కలిసి 22 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాం. 800 బస్తాలు రావాల్సిన దిగుబడి 400బస్తాలు మాత్రమే వచ్చింది. పెట్టుబడి కూడా ఎల్లలేదు. వేరుశనగ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- గోపాల్, సిర్సవాడ గ్రామ రైతు

తెగుళ్లే ప్రధాన కారణం



పెట్టిన పెట్టుబడులకు వచ్చే దిగుబడికి పొంతన లేకుండాపోయింది. పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉన్న ధరలలో నైనా కలిసొస్తుందనకున్నాం. మాకు అది కూడా నేల చూపులే చూడటంతో పెట్టుబడి కూడా వెళ్లడం లేదు.

- జానకిరాంరెడ్డి, ఖిలాన్‌పల్లి గ్రామం

కాసుల కోసం కోతలు

ప్రైవేటు ఆస్పత్రులలో నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్ ఆపరేషన్‌లు


అయిజ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రులలో నిబంధనలకు పాతర వేస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల యజమాన్యం కాసుల కక్కుర్తితో కడుపు కోత (సిజేరియన్ ఆపరేషన్) చేస్తున్నారు. గర్భిణుల బంధువుల్లో భయాందోళన కలిగిస్తూ సాధారణ ప్రసవాలను కాదని సిజేరియన్ ఆపరేషన్‌లు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలలో సాధారణ ప్రసవాలను లెక్కకు మించి చేస్తుండగ ప్రవేటు ఆస్పత్రి యాజమాన్యాలు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సిజేరియన్ ఆపరేషన్‌లు చేస్తున్నారు. 30 శాతానికి మించి సిజేరియన్ ఆపరేషన్‌లు చేయరాదన్న ప్రభుత్వ నిబంధనలకు పాతర వేస్తూ 78 నుంచి 97 శాతం వరకు సిజేరియన్ ఆపరేషన్‌లు చేశారు.

జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 16 ప్రవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఒక సంవత్సర కాలం వరకు కాన్పులు లెక్కిస్తారు. ఇందులో ప్రైవేటు, ప్రభుత్వ కాన్పులు వేరువేరుగా లెక్కిస్తారు. 2024-2025 సంవత్సరం ఫిబ్రవరి 10వ తేదీ నాటికి ప్రవేటు ఆస్పత్రులలో 2,229 ప్రసవాలు జరిగాయి. వాటిలో అత్యధికంగా 1,716 సిజేరియన్ ఆపరేషన్‌లు చేశారు. 513 మాత్రమే సాధారణ ప్రసవాలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులలో 4,900 ప్రసవాలు చేస్తే వాటిలో 1,117 సిజేరియన్, 3,783 సాధారణ ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ కాన్పులు అధికంగా జరిగితే, ప్రవేటు ఆస్పత్రులలో సిజేరియన్‌లు అధికంగా జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం 30 శాతం మాత్రమే సిజేరియన్ ఆపరేషన్‌లు చేయాల్సి ఉంది. కానీ, అంతకు మించి 78 నుంచి 97 శాతం వరకు సిజేరియన్ ఆపరేషన్‌లు చేస్తున్నారు. జిల్లాలో 2021-22 ఫిబ్రవరి నుంచి ఇదే తంతు కొనసాగిస్తున్నారు.

సిజేరియన్ ఆపరేషన్‌తో బాదుడు

సిజేరియన్ ఆపరేషన్ చేసుకున్న వారి నుంచి రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. మందులతో కలుపుకుంటే ఖర్చు తడిసిమోపెడవుతోందని కొందరు బాధితులు వాపోతున్నారు. సిజేరియన్ ఆపరేషన్‌లలో అయిజలోని ప్రవేటు ఆస్పత్రులు అత్యధికంగా ఉండటం గమనార్హం.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రవేటు ఆస్పత్రులలో తప్పని సరిగా సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రసవ సమయంలో గర్భిణులు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నపుడు మాత్రమే సిజేరియన్ ఆపరేషన్ చేయవచ్చు. ఎట్టి పరిస్థితులలో సిజేరియన్ జోలికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ కాన్పులు అధికంగా జరుగుతుంటే ప్రవేటు ఆస్పత్రులలో సిజేరియన్ కాన్పులను ప్రోత్సహించటం సరికాదు. నిబంధనల మేరకు 30 శాతం మించి ప్రవేటు ఆస్పత్రులలో సిజేరియన్ ప్రసవాలు చేయరాదు. నిబంధనలు విస్మరిస్తే చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ చందూనాయక్, జిల్లా వైద్యశాఖాధికారి

మా గ్రామాన్ని ముంచొద్దు

గోకారం రిజర్వాయర్‌లో ఎర్రవల్లి గ్రామాన్ని ముంపునకు గురికాకుండా కాపాడాలి



ఎర్రవల్లి గ్రామానికి ఏ రాజకీయ పార్టీ నాయకులూ ఓట్లు అడగడానికి రాకూడదని ఏర్పాటు చేసిన బ్యానర్

చారకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని గోకారం రిజర్వాయర్‌లో ఎర్రవల్లి, ఎర్రవల్లి తండాలు ముంపునకు గురికాకుండా చూడాలని ఎర్రవల్లి గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గోకారం రిజర్వాయర్ నిర్మిస్తే ఎర్రవల్లి, ఎర్రవల్లితండా గ్రామాలు ముంపునకు గురి అవుతాయని వాపోయారు. ప్రభుత్వం వెంటనే రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించే వరకు ఏ రాజకీయ పార్టీల నాయకులు మా గ్రామాలకు ఓట్లు అడగడానికి రాకుడాదని ఎర్రవల్లిలో ఆదివారం బ్యానర్లను ఏర్పాటు చేశారు. మా గ్రామాలకు జరుగుతున్న అన్యాయానికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

అమ్మవారిని దర్శించుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ దర్శించుకున్నారు. పదర మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన అమ్మా టెంట్‌హౌస్ తిరుపతి గత ఎన్నికల ముందు వంశీకృష్ణ ఎమ్మెల్యే గా గెలిస్తే మొక్కు తీర్చుకుంటానని మైసమ్మ దేవతకు మొక్కుకున్నారు. ఆదివారం మైసమ్మ దేవతను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మొక్కుబడి తీర్చుకోవడం కోసం ఎమ్మెల్యే వంశీకృష్ణ మైసమ్మ ఆల యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ యా దవ్ ఆహ్వానం పలికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి, మాజీ సర్పంచ్ దశరథం, జెట్టిప్ప, మల్లికార్జున్, సుబ్బదాస్, అనిల్, హరికృష్ణ, విజ్జు పాల్గొన్నారు.



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను మొక్కుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఫీజులుం!

● విద్యార్థులపై ఒత్తిడి...

» మొత్తం చెల్లిస్తేనే పరీక్ష రాయనిస్తాం ...

» విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం హుకుం

» ఫీజుల నియంత్రణ లేకపోవడంతో ఇబ్బందులు

» పట్టించుకోని విద్యాశాఖ



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వేధింపులు కొనసాగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫీజు కట్టాలంటూ ఓ పాఠశాల ప్రిన్సిపాల్ తోటి విద్యార్థుల ముందు నిల్చోబెట్టడంతో మేడ్చల్‌లోని పాఠశాలలో ఓ విద్యార్థి తీవ్ర మనస్తాపంతో పాఠశాలకు వెళ్లకుండా కొన్నిరోజులు ఇంట్లో ఉండిపోయింది.. పాఠశాలకు పోవాలని తల్లిదండ్రులు ఒత్తిడి తేవడంతో ఆత్మహత్య చేసుకుంది. మరో పాఠశాలలో కూడా ఫీజులు చెల్లించలేదని ఇబ్బంది పెట్టడంతో విద్యార్థులు అవమానం భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం ప్రైవేట్ పాఠశాలలపై ఫీజుల దోపిడీ విషయంలో దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 1100కు పైగా ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం ఏ పాఠశాలలో ఎంత ఫీజు ఉండాలి... పాఠశాల ప్రారంభానికి ముందే తల్లిదండ్రుల కమిటీలు వేసి ఫీజులు ఏ తరగతి ఎంత ఉండాలని నిర్ణయించాలి.. కానీ ఆ కమిటీలు ఎక్కడా లేవు. యాజమాన్యాలు రాసిందే ఫీజులు.. వారు చెప్పినంత కట్టాల్సిందే.. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు లేవు.. యాజమాన్యాలు చెప్పిన ఫీజులు మాత్రం తూచ తప్పకుండా చెల్లించాల్సిందే.. ఫీజుల కంటూ ప్రైవేట్ పాఠశాలల్లో ఓ నియంత్రణ లేకపోవడం.. ఒక్కో పాఠశాల ఒక్కో ఫీజు చెల్లించాలని చెప్పడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. వార్షిక పరీక్షల సమయం సమీపిస్తుండటంతో మొత్తం ఫీజు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఈ విషయంలో ఫీజుల భయం పట్టుకుంది. ఇప్పటికే సిలబస్ పూర్తికావడం, రివిజన్ తరగతులు జరుగుతుండటం పరీక్ష ముందు విద్యార్థులకు ప్రాక్టీస్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మార్చి మొదటి వారంలో ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. అప్పటిలోపు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు మొత్తం ఫీజులను ముక్కుపిండి వసూలు చేసుకునే పనిలో పడ్డారు. వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. అప్పటిలోపు వంద శాతం ఫీజులు చెల్లిస్తేనే పదో తరగతి హాల్‌టికెట్స్ ఇస్తామని, అదికూడా ఫిబ్రవరి చివరి వరకు మొత్తం ఫీజులు చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకోవాలని విద్యార్థుల పని ఒత్తిడి పెంచుతున్నారు. చాలా పాఠశాలల్లో తరగతి గదిలోనే అందరు విద్యార్థుల ముందు మీ ఫీజు ఇంకా పెండింగ్‌లో ఉంది... ఎప్పుడు చెల్లిస్తారు.. ఫీజులు మొత్తం చెల్లించాలి.. ఫీజు మొత్తం చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తాం.. అంటూ విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారు. మరోపక్క విద్యార్థుల తల్లిదండ్రులకు నిత్యం ఫోన్ చేసి మీ పిల్లల ఫీజులు ఇంకా కట్టలేదు... త్వరగా చెల్లించండి అంటూ తమ సిబ్బందితో ఫోన్ చేయిస్తున్నారు.

● మొదట ఓ మాట ... ఇప్పుడో మాట

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నాయని విద్యార్థులతల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రారంభ సమయంలో రంగు రంగుల బ్రోచర్ చూపించి తమ పాఠశాలలో నాణ్యమైన విద్యనందిస్తాం... మంచి మార్కులు సాధిస్తే ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇస్తామని చెప్పి కొన్ని పాఠశాలల యాజమాన్యాలు పిల్లలను తమ పాఠశాలల్లో చేర్చుకొని ఆ తర్వాత తమకు ఫీజుల కోసం చుక్కలు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు ట్యూషన్ ఫీజు, బుక్కులు, నోట్స్ , ఇతర పరీక్షల ఫీజులు అంటూ గతంలో చెప్పిన దానికంటే 10 నుంచి 25 శాతం వరకు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం.. ఏడాదిలో ఒక్కసారైనా మండల, జిల్లా విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తున్నారు.

● చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గల ఓ పాఠశాల, వేంకటేశ్వర కాలనీలో గల ఓ పాఠశాల, భగీరథ కాలనీలో ఓ పాఠశాల, పాత డీఈవో కార్యాలయానికి సమీపంలో ఉన్న పాఠశాలను ఐదు నెలల కింద టఅప్పటి మండల విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. వారు మామూళ్లు ఇవ్వడంతో ఏమీ పట్టనట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. మరికొన్ని పాఠశాలలకు ఒకే అనుమతి ఉన్నా మూడు, నాలుగు బ్రాంచీలను నడుపుతున్నారు. ఆ పాఠశాలకు భవనాల ముందు పేరు కూడా పెట్టకుండా అనుమతి లేకుండా కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం ప్రైవేట్ పాఠశాలలను తనిఖీలు మాత్రం చేయడం లేదు. అనుమతులు లేని పాఠశాలల వైపు కన్నెత్తి చూడటం లేదు.

● ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు, హాల్‌టికెట్లు..

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న చిన్నా చితక ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల కోసం అంత వత్తిడి లేకపోయినా.. కార్పొరేట్‌తో పాటు పెద్ద పాఠశాలల్లో మాత్రం ఫీజుల కోసం తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. విద్యార్థులను అందరి విద్యార్థుల ముందే నీ ఫీజు చెల్లించలేదు.. తరగతులకు హాజరు కావద్దు.. మొత్తం ఫీజు చెల్లించాలని.. తర్వాతే తరగతులకు రావాలంటూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు గత 20 రోజుల నుంచి నిత్యం విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. పాఠశాల నుంచి విద్యార్థులకు ప్రతీ రోజు ఫోన్ చేసి మీ పిల్లల ఫీజు చెల్లించలేదు.. ఇంకా ఎన్ని రోజులు బొంకుతారు.. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తామంటూ పలు పాఠశాలల యాజమన్యాలు నిత్యం ఫోన్‌లు చేస్తున్నట్లు తెలిసింది.

● గతంలో రూ. 36వేలు ఫీజు చెప్పారు..

- ఓ విద్యార్థి తండ్రి

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గల ఓ పాఠశాలలో తన ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. ఇద్దరు పిల్లలను ఆ పాఠశాలలో చేర్పినా. ఆరో తరగతి పిల్లాడికి రూ.36 వేయి, నాల్గో తరగతి పిల్లాడికి రూ. 30 వేలని చెప్పారు. కానీ మొత్తం ఫీజు చెల్లించాను. అయితే ఆ ఫీజులోంచి బుక్కులకు, నోట్ బుక్కులకు పది వేలు తీసుకున్నాం. అప్పట్లో బుక్కుల ఫీజులు చెల్లించలేదని చెపుతున్నారు. ఇంకా రూ .16,500 చెల్లిస్తేనే ఫీజు పూర్తవుతుంది. అప్పుడే పరీక్షలు రాయనిస్తామని చెబుతున్నారు.

బీరు.. బాప్‌రే!

● ఒక బాటిల్ వెంట రూ.30 పెరుగుదల

» ఎమ్మార్పీపై 15 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం

» మద్యం ప్రియుల జేబులకు చిల్లులు

నారాయణపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీరు ధరలు పెరగడంతో మద్యం ప్రియుల జేబులకు చిల్లు పడినట్లయింది. దాంతో మద్యం ప్రియులు పెరిగిన బీరు ధరలతో ఆందోళన చెందుతున్నారు. నారాయణపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 22 మద్యం దుకాణాలు ఉండగా ముడు బార్‌లు ఉన్నాయి. వీటికి డిపోల నుంచి మద్యం సరఫరా అవుతున్నది. 2023 మేలో ఒక్కో బీరు బాటల్‌పై రూ.10 పెంచిన ప్రభుత్వం 2024లో తగ్గించింది. మళ్లీ ఏడాది గడవకు ముందే పదిహేను శాతం ధరలు పెంచడంతో ఒక్కో బీర్ బాటిల్‌పై రూ.30 ధర పెంచుతూ తాజాగా నిర్ణయం తీసుకుంది. దాంతో మద్యం ప్రియులపై ఆర్థిక భారం పడనుంది.

పేట సర్కిల్‌లో మద్యం విక్రయాలు ఇలా..

నారాయణపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 22 మద్యం దుకాణాలు ఉండగా మూడు బార్‌లు ఉన్నాయి. విక్రయాలకు సంబంధించి 2023 సంవత్సరంలో ఐఎంఎల్ లిక్కర్ 225533 కాటన్స్, బీర్‌లు 437253 కాటన్లు విక్రయాలు జరిగాయి. దాంతో రూ.217,64,73,082 మద్యం విక్రయాలు ఒక్క పేట సర్కిల్ పరిధిలోనే జరిగాయి. 2024 సంవత్సరంలో ఐఎంఎల్ లిక్కర్ 258421 కాటన్స్, బీర్‌లు 389746 కాటన్లు విక్రయాలు జరిగాయి. దాంతో రూ.246,98,07,119 మద్యం విక్రయాలు ఒక్క పేట సర్కిల్ పరిధిలోనే జరిగాయి. దాంతో లిక్కర్ కంటే బీర్ల విక్రయాలే అధికంగా జరిగాయి. రెండేళ్లలో రూ.465 కోట్ల మద్యంను మద్యం ప్రియులు పేట సర్కిల్‌లో తాగేశారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి



మోమినాపూర్ శివారులో మృతి చెందిన చిరుతను పరిశీలిస్తున్న అధికారి

మద్దూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ చిరుత మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం మోమినాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకొంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మోమినాపూర్ గ్రామ శివారులో చిరుత మృతి చెంది ఉన్న విషయాన్ని సమీప పొలం వారు గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఆదివారం ఫారెస్టు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిరుత మెడ భాగంపై తీవ్ర గాయాన్ని గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం వివరాలను వెల్లడిస్తామని ఫారెస్టు అధికారులు తెలిపారు. సంవత్సర కాల వ్యవధిలో మండల సరిహద్దు ప్రాంతాల్లో మూడు చిరుతలు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.

పిచ్చికుక్కల స్వైరవిహారం

- 12 గంటల్లో 11మందికి గాయాలు..

కోస్గి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. ఆదివారం ఉదయం పట్టణంలోని ఎస్సీ కాలనీలో నలుగురిని, శనివారం రాత్రి మామిళ్లవీధిలో ఇద్దరిని, బాహర్‌పేటలో ఐదుగురిని పిచ్చికుక్కలు గాయపరిచాయి. వారందరికీ కోస్గి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మామిళ్ల నర్సమ్మను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. నందిగామ వెంకటమ్మ కావలి లక్ష్మయ్య, నందిపాటి హన్మంతు, దేరేపల్లి ఎల్లమ్మ, కన్నప్ప, గందె రాజుకు కోస్గి ఆసుపత్రిలో వైద్యం అందించారు. పిచ్చికుక్కలపై ఫిర్యాదు రావడంతో మునిసిపల్ సిబ్బంది ఒక కుక్కను పట్టుకున్నారు. పిచ్చికుక్కలు ఇంకెక్కడైనాఎవరిపైన దాడిచేసినా వెంటనే మునిసిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని, ముఖ్యంగా చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపించొద్దని కమిషనర్ నాగరాజు తెలిపారు.

కృష్ణానదిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కృష్ణ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామ శివారులోని చెక్‌పోస్టు సరిహద్దులో ఉన్న కృష్ణానదిలో ఆదివారం చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా శక్తినగర్ పీఎస్‌ఐ తిమ్మన్న తెలిపిన వివరాల ప్రకారం.. రాయచూరు శియాతలబ్‌కు చెందిన వ్యక్తి ఆదివారం ఉదయం కృష్ణానదిలో స్నానం ఆచరించి సుగురేశ్వరస్వామిని దర్శనం చేసుకోవడానికి కృష్ణానదిలో దిగి స్నానం చేస్తూ నీటిలో మునిగి మృతి చెందినట్లు వారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

మహిళ, బాలుడు అదృశ్యం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కూతురు వద్దకు తన మనవడిని తీసుకొని వస్తున్నా అంటూ బయలుదేరిన ఓ మహిళ, బాలుడు అదృశ్యమైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాయిండ్ల సత్యమ్మ కూతురు సంపూర్ణ కొంత కాలంగా భర్తతో కలిసి రంగారెడి జిల్లా శంషాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఈ నెల 14న సత్యమ్మ గ్రామం నుంచి కూతురు కొడుకు(ఆదిత్య)ను శంషాబాద్‌కు తీసుకొస్తున్నానని ఫోన్ చేసి చెప్పింది. సాయంత్రం గడిచినా ఇద్దరు రాకపోవడంతో ఆందోళన చెందిన ఆమె పోలీసులకు పిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు యువకుల బలవన్మరణం

మన్ననూర్/మూసాపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు వేర్వేరు ప్రాంతాల్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూరు సమీపంలో గల నిరంజన్ షావలి దర్గా ప్రాంతం అడవిలో చెట్టుకు ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. అమ్రాబాద్ ఎస్‌ఐ రజిత కథనం మేరకు వివరాలు... బల్మూరు మండల కేంద్రానికి చెందిన జహంగీ ర్(28) అనే యువకుడు మేస్త్రీ పని చేస్తూ ఉంటాడు. ఈ నెల 9వ తేదీ అదృశ్యమైనట్లు అతడి తండ్రి లాల్‌మహ్మద్ బల్మూరు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం మన్ననూరు సమీపంలోని నిరంజన్ షావలి దర్గా వద్ద కొందరు వ్యక్తులు కందూరు నిర్వహిస్తున్న క్రమంలో పరిసరాల్లో ఓ చెట్టుకు ఉరేసుకున్న మృతదేహం వేలాడుతూ కనిపించగా, అట్టి ఫొటోను చరవాణీల్లో చిత్రీకరించి వాట్సాప్ గ్రూపుల్లో పంపించారు. ఇదే విషయాన్ని అమ్రాబాద్ పోలీసులకు సమాచా రాన్ని అందించగా, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదే క్రమం లో వాట్సాప్‌లో వచ్చిన ఆత్మ హత్య చేసుకున్న వ్యక్తి బల్మూరుకు చెందిన జ హంగీర్‌గా గుర్తించినట్లు తెలిపారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సుంకురామయ్యపల్లిలో..



ఆకులమోని మల్లేష్(ఫైల్)

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం సుంకురామయ్యపల్లిలో ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సుంకురామయ్యపల్లి గ్రామానికి చెందిన ఆకులమోని అలివేలు, పెద్దకొండన్న దంపతుల రెండో కుమారుడు ఆకులమోని మల్లేష్ (21) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు దైవదర్శనార్థం శ్రీశైలం వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని వేళలో ఉరివేసుకోగా గమనించిన చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తలుపు గడియ పగులగొట్టి మృతదేహాన్ని బయటికి తీశారు. ఆత్మహత్యకు సంబంధించిన వివరాలు తెలియాల్సిఉంది.

ఎంపీలు, మంత్రులు రాజీనామా చేయాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



జాన్‌వెస్లీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పాలమూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు తీసుకురాని ఎంపీలు, మంత్రులు రాజీనామా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అరుంధతి భవనంలో 'కేంద్ర బడ్జెట్ వివిధ రంగాలపై ప్రభావం' అనే అంశంపై ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీకి 8మంది ఎంపీలను గెలిపిస్తే ప్రజలకు మొండి చేయి చూపిందన్నారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించకుండా అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26బడ్జెట్‌లో 50లక్షల 65వేల కోట్ల బడ్జెట్ పెట్టి శ్రామిక వర్గాలు, రైతు, వ్యవసాయ కూలీలు, మధ్య తరగతికి నిలువునా ముంచిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను సీపీఎం హర్షిస్తోందన్నారు. బీసీ జనాభా తగ్గింపు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. దళిత, గిరిజన, మైనారిటీ వెనుకబడిన తరగతులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపిందని.. దానికి వ్యతిరేకంగా 18, 19వ తేదీల్లో గల్లీనుంచి ఢిల్లీ వరకు నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్ కంటే రూ.30కోట్లు నిధులు తగ్గించటం దారుణమన్నారు. 30 కోట్ల జనాభా ఉన్న ముస్లింలకు మూడున్నరకోట్ల వేల కోట్ల బడ్జెట్ కేటాయింపు సరికాదన్నారు. మహిళల సంక్షేమాన్ని గాలికి ఒదిలేశారు.. రైతాంగానికి బడ్జెట్‌లో ఉపశమనం లేదు.. మద్దతు ధర సబ్సిడీ, రుణమాఫీకీ ఊరట లేదని.. 13నెలలు పోరాడిన ఫలితంగా నల్లచట్టాలను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం ఆకలిచావులు పెంచేరకంగా బడ్జెట్ ఉందని విమర్శించారు. ఆహార సబ్సిడీ తగ్గించి, విద్య, వైద్యం వ్యాపారంగా మార్చాలని, దోపిడీ శక్తులైన పెట్టుబడి దారులు కార్పొరేట్లకు ఏడు లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించారన్నారు. పేదలకు, మధ్య తరగతికి 30శాతం పన్నులు విధించి వాళ్ల పీకలు వాల్చేరకంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడా కార్పొరే ట్లకు 22శాతం పన్నులు విధించి, ఉద్యోగ, కార్మికులపై 30శాతం పన్నులు విధించడమంటే బీజేపీ నైజం కనపడుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్ కేటాయించాలన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న వాగ్దానం అమలు పరచాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, భూపాల్, వెంకట్రాములు, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ప్రముఖ న్యాయవాది బెక్కెం జనార్దన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, బి.చంద్రకాంత్, వి.పద్మ పాల్గొన్నారు.

జాన్‌వెస్లీని సన్మానించిన ప్రజా సంఘాలు

ఆదిజాంబవ అరుంధతి సంఘం, భవన నిర్మాణ కార్మికసంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, మునిసిపల్ వర్కర్స్ యూనియన్, ఐద్వా, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆవాజ్, ఎస్‌ఎఫ్‌ఐ, పాలమూరు యూనివర్సిటీ జేఏసీ, ఎంఎస్ఎఫ్ నాయకులు జాన్‌వెస్లీని సన్మానించారు. అలాగే, హన్వాడ, జడ్చర్ల, బాలానగర్, అడ్డాకుల, భూత్పూర్, రాజాపూర్, మహబూబ్‌నగర్ పట్టణం, దేవరకద్ర దళిత సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తిమ్మప్ప, హనుమంతు, ఆదిలక్ష్మయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్‌లు ఆయనను సన్మానించారు.

● ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కార్మిక సంఘం తరపున వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, కార్మికులందరికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని వినతిలో పేర్కొన్నారు.. మునిసిపల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేష్, కావలి కేశవులు, తెలుగు సత్తయ్య, కేశవులు, కృష్ణ, ఆకుల వెంకటేష్ ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని.. యువకుడు మృతి



సొప్పరి రాఘవేందర్(ఫైల్)

మిడ్జిల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వేముల గ్రామ శివారులోని వెలిజాల-మిడ్జిల్ రోడ్డు వెంకోహెచారిస్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సొప్పరి చిన్న జంగయ్య కుమారుడు సొప్పరి రాఘవేందర్(25) మిడ్జిల్ మండలం చిలువేరు గ్రామంలోని బంధువుల వివాహ కార్యక్రమానికి వచ్చాడు. తిరిగి మిడ్జిల్ నుంచి తలకొండపల్లి మండలం వెలిజాల వైపు వెళుతుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ప్రభుత్వ అస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు వెంకోహెచారిస్‌కు చెందిన వాహనం ఢీకొన్నదని తమకు కంపెనీలో ఉన్న సీసీ ఫుటేజీలను చూపించాలని మృతదేహంతో ధర్నాకు దిగారు. తమకు వెంకోహెచారిస్ వారు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. గుర్తు తెలియని వాహనం ఆచూకీ కోసం సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మృతుడికి వివాహం జరిగి 10నెలలు కావస్తుందని, ప్రస్తుతం అతని భార్య గర్భవతి అని, మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

పునరావాసం ఫైలు పరిశీలనలో ఉంది

» త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ

» జలమండలి కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష

» వివరాలు వెల్లడించిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల నిర్వాసితులకు సంబంధించిన పునరావాసం పెంపునకు సంబంధించిన ఫైలు పరిశీలనలో ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే పెంపుపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఆదివారం ఇరిగేషన్‌శాఖ అధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారన్నారు. సమీక్షలో పాల్గొని ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యలను మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే వెల్లడించారు. పునరావాసం పెంపు అంశంలో నిర్వాసితులకు ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. నిర్వాసితులకు అండగా ఉంటానని, అధికార పక్షానికి చెందిన ఎమ్మెల్యేనే అయిన తాను అవసరమైతే ఎవరితోనైనా పోరాడుతానని వెల్లడించారు.

గత ప్రభుత్వం చేసిన తప్పులకు నేడు తాను శిక్షను అనుభవిస్తున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలు, పునరావాస పరిహారం పెంచాలంటూ ఎమ్మెల్యే కాకముందే పోరాటం చేశానని, ఎమ్మెల్యే అయిన అనంతరం మొదటి అసెంబ్లీ సమావేశంలో సభ దృష్టికి తీసుకువచ్చానని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఉదండాపూర్ రిజర్వాయర్ గుండెలాంటిదన్నారు. కుడి, ఎడమ కాలువతో నీళ్లు అందిస్తే 8లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గత ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టు సామర్థ్యాను ఒక టీఎంసీ పెంచి, ప్రాజెక్టు వ్యయాన్ని రూ.30వేల కోట్లకు పెంచిందని, అదే సమయంలో ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యను పట్టించుకుని ఉంటే ఎప్పుడో పరిష్కారమయ్యేదని పేర్కొన్నా రు. పరిహారం పంపిణీ అంశంలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకే రీసర్వే చేస్తున్నారని, సర్వే పూర్తయి అవార్డు పాసైతేనే పరిహారం విషయంలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని, నిర్వాసితులు గుర్తించాలని కోరారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు రాబోయే రోజులన్నీ మంచి రోజులేనంటూ పేర్కొన్నారు.

మాలధారణ

పూర్వజన్మ సుకృతం

» శివస్వాముల మహాపడి పూజలో రాజ్‌కుమార్‌రెడ్డి



జాజాపూర్ శివస్వాముల పూజలో రాజ్‌కుమార్‌రెడ్డి

నారాయణపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాలధారణ పూర్వ జన్మ సుకృతం అని ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని భీష్మ ఫౌం డేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామ శివాలయం దగ్గర జరిగిన శివస్వాములు పడిపూజనుద్దేశించి ఆయన మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. నిత్యం ఆలయాల్లో పూజలతో పాటు ధూప దీప నైవేద్యాలు సమర్పించాలన్నారు. శివస్వాములు నియమనిష్టలతో మాలధారణ చేసి మహాశివరాత్రి పర్వది నం రోజు శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి కాలినడకన స్వాములు వెళ్ల డం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో స్వామి శివ, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, గురుస్వాములు, శివస్వాములు, గ్రామస్థులు పాల్గొన్నారు. నారాయణపేటలో ఆదివారం అంబణ్ణ శివాలయంలో శివగురుస్వాములు మహాపూజ నిర్వహించారు. అంతకు ముందు మహంకాళీ శివాలయం నుంచి కలశం, జ్యోతి ఊరేగింపుతో గణేష్ మార్గ్ గుండా ఊరేగింపు అంబణ శివాలయం వరకు జరిగింది. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. శివ గురుస్వాములు సత్య యాదవ్, బండి గోపాల్‌రెడ్డి, కన్న జగదీష్, నర్సింహ, శశికాంత్ ఉన్నారు.

పారా అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



కోల్పూర్ లింగప్ప   దామరిగిద్ద కనకప్ప

నారాయణపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నయ్‌లో ఈ నెల 17 నుంచి 21 వరకు జరిగే జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు నారాయణపేట జిల్లాకు చెందిన కోల్పూర్ లింగప్ప, దామరిగిద్ద కనకప్పలు ఆదివారం తరలివెళ్లారు. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వంద, రెండు వందల మీటర్ల పరుగు పందెంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా లింగప్పకు మక్తల్‌కు చెందిన బాలకృష్ణారెడ్డి పదివేల ఆర్థిక సహాయం చేశారు. చెన్నయ్‌కి వెళ్తున్న క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి రమణ అభినందించారు.

రైలు కిందపడి మహిళ మృతి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఆదివారం ఓ గుర్తుతెలియని మహిళ(35) మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ముదిరెడ్డిపల్లి సమీపంలో రైలు పట్టాలపై మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలం చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలు మెరూన్ బ్లాక్ కలర్ పంజాబి డ్రెస్ ధరించి ఉన్నది. వివరాలు తెలిసిన వాళ్లు రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్సై అక్బర్ తెలిపారు.

న్యూస్ బాక్స్

కొనసాగుతున్న దిగంబర యజ్ఞం

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచదేవ్ పహాడ్ సమీపంలోని శ్రీపాద ఛాయ ఆశ్రమంలో ఆదివారం దిగంబర యజ్ఞం కొనసాగింది. ఆశ్రమ పీఠాధిపతి చింత శ్రీపతి స్వామి దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహించి దిగంబర శ్రీపాద వల్లభ దిగంబరా అంటూ యజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


ప్రచారంలో ఇందు జ్ఞాన వేదిక సభ్యులు

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పండుగ పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సోమేశ్వరబండలో గ్రంథాల ప్రచారం, శివరాత్రి పండుగపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, కృష్ణయ్య, విష్ణువర్ధన్, తిరుపతయ్య, వెంకటేష్, రజిత, రాధిక పాల్గొన్నారు.

సాహితీ పుస్తకాలు అందజేత


పుస్తకాలు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

ధన్వాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి మదన భూపాల్‌రెడ్డి సాహిత్యం పుస్తకాలు అందించారు. ఆదివారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ధర్మకర్త సుంకు నర్సింహులు శివపురాణం, గురు చరిత్ర, మహాభారతం, భగవద్గీత, రామాయణం పుస్తకాలు అందించారు. ఆధ్యాత్మిక భావన పెంపొందించాలనే సంకల్పంతో సాహిత్యం పుస్తకాలు అందించడం జరిగిందని భూపాల్‌రెడ్డి తెలిపారు.

నేడు శివాజీ విగ్రహం ఆవిష్కరణ

ఊట్కూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొర్లలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహ ఆవిష్కరణ సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు శివాజీ సేన గ్రామ అధ్యక్షుడు అంబురావ్ ఆదివారం తెలిపారు. ప్రముఖులు పాల్గొని ఆవిష్కరణ చేస్తారని తెలిపారు. మండలంలోని యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు


డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ అంజిలయ్య

నారాయణపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపరాదని ఏఎస్ఐ అంజిలయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేసి ఆరు కేసులు నమోదు చేశారు. ఏఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు పునరావృతం అయితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారన్నారు.

స్నేహితుల చేయూత

జడ్చర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మిత్రుడు గుండెపోటుతో మృతి చెందగా, కుటుంబానికి బాల్యమిత్రులంతా అండగా నిలవాలని భావించారు. వారంతా జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో 1989-90లో కలిసి పదో తరగతి విద్యాభ్యాసం చేశారు. వీరిలో జడ్చర్ల మండలం బూర్గుపల్లికి చెందిన కావలి మల్లయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మిత్రుడి భార్యకు రూ.51 వేల నగదుతో పాటు నిత్యావసర వస్తువులను ఆదివారం వారు అందజేశారు. విఠాల సంతోష్‌కుమార్, రాజేష్, తాహెర్, మల్లిఖార్జున్, నారాయణ, రమణ, రామ కొండ, భీమయ్య, కిట్టు, రాధాకృష్ణ, శివ, లింగారెడ్డి ఉన్నారు.

హన్వాడ: హన్వాడ గ్రామానికి చెందిన నజీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పదో తరగతి 2002కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.20వేలు ఇద్దరి కూతుర్ల పేరు మీద ఖాతాలో వేశారు.

పెరిగిన ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు

- కొడంగల్ నియోజకవర్గంలో పునర్విభజన
- దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి మండలాల ఏర్పాటు
- పోలింగ్ స్టేషన్‌ల తుది జాబితా వెల్లడి


కొత్తపల్లిలో పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేస్తున్న అధికారులు (ఫైల్)

మద్దూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొడంగల్‌తో పాటు మద్దూర్, కోస్గి, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాలున్న కొడంగల్ నియోజకవర్గంలో ప్రజాభీష్టం మేరకు గత ప్రభుత్వం మండలాల పునర్విభజన చేపట్టి మరో మూడు అదనంగా ఏర్పాటు చేసింది. దీంతో నియోజకవర్గంలో ఐదు నుండి ఎనిమిదికి మండలాల సంఖ్య చేరింది. కొడంగల్ మండలంలోని 12 గ్రామాలతో దుద్యాల, కోస్గి మండలంలోని 11 గ్రామాలతో గుండుమాల్, మద్దూర్ మండలంలోని 12 గ్రామాలతో కొత్తపల్లి కొత్త మండలాలు ఏర్పడ్డాయి.

ఎంపీటీసీ స్థానాల సంఖ్య ఇలా..

కొత్తగా ఏర్పడ్డ మండలాల్లో జనాభ ప్రాతిపదికన అధికారులు ప్రాదేశిక నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. ఏడు ఎంపీటీసీ స్థానాలతో దుద్యాల, 11తో గుండుమాల్, 12తో కొత్తపల్లి మండలాల స్థానాలు మండల పరిషత్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కొత్త మండలాల్లో త్వరలో జరగబోయే ఎన్నికల్లో మొదటి సారిగా ఎంపీపీలు, జడ్పీటీసీలుగా ఎన్నిక కానున్నారు.

రసవత్తరంగా మారనున్న ఎన్నికలు

తక్కువ స్థానాలతో ఏర్పడ్డ కొత్త మండలాల్లో ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నిక రసవత్తరంగా మారనుంది. కొత్తపల్లిలో ఐదు ఎంపీటీసీ స్థానాల్లో మూడు స్థానాలు కైవసం చేసుకొనే పార్టీ మండల పరిషత్‌ను దక్కించుకోనుంది. దీంతో ఎంపీపీ పదవి కోరుకునే అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తాము సైతం పోటీలో ఉంటామని సంకేతాలు ఇస్తున్నారు. వాటితోపాటు ఆరు స్థానాలున్న గుండుమాల్, ఏడు స్థానాలున్న దుద్యాల మండలాల్లో సైతం ఇప్పటి నుంచే ఎన్నికల వేడి పుంజుకుంది. అలాగే తక్కువ ఓటర్ల సంఖ్య ఉన్న కొత్త మండలాల్లో జడ్పీటీసీ స్థానానికి సైతం పోటీ చేయడానికి అభ్యర్థులు పావులు కదుపుతున్నారు.

సిద్ధం చేసుకున్న జిల్లా అధికారులు

ఎన్నికల సంఘం షెడ్యూల్ ఎప్పుడు విడుదల చేసిన నిర్వహణకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉన్నారు. వారం రోజులు మండల అధికారులతో వీటీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమాయత్తం చేశారు. ఇక ఎన్నిక షెడ్యూల్ కోసం ఆశావాహులు ఎదురు చూస్తున్నారు.

ముగిసిన ధర్మజాగృతి ప్రవచనం


తులాభారం నిర్వహిస్తున్న వీరశైవులు

మరికల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ వీరశైవుల సంఘం ఆధ్వర్యంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో మూడు రోజులుగా చేపట్టిన ధర్మజాగృతి ప్రవచనం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి శ్రీపశ్చిమాద్రి సంస్థాన విరక్తామఠం నేరెడుగొం పీఠాధిపతులు శ్రీపంచమ సిద్ధయ్యలింగం మహాస్వామి, పక్కిరేశ్వర మఠం శహపూర మనిప్ర గురుపాద స్వామి, అడవీశ్వర మఠం కల్లూరు నందిన్ని శంభులింగస్వామి, శాంతానంద పూరోహిత్, ఆదిత్య పరాశ్రీ గురువు పాల్గొన్నారు. నేరెడుగొం స్వామిజీకి అడ్వకేట్ అయ్యప్ప దంపతులు లక్షపుష్పాభిషేకం, తులాభారం నిర్వహించారు. వచ్చే నెల 17న నేరెడుగొం మఠంలో ప్రతి నిరుపేద కుటుంబం ముందుగా పేర్లు నమోదు చేసుకుని ఉచిత వివాహం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బస్వరాజ్, తిప్పయ్య, వీరన్న, వీరేశం, శివప్రసాద్, శెట్టి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మక్తల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రగతిశీల హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ.. ఈనెల 21న రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం ఖమ్మంలో మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. హమాలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్రంలో సుమారు మూడు లక్షల మంది వివిధ రంగాల్లో హమాలీ, మిల్ కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ మార్కెట్, సివిల్ సప్లయ్, గ్రానైట్, మార్బుల్, ప్రయివేటు తదితర రంగాల్లో పనిచేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడం లేదన్నారు. కార్మికులకు బీమా, ఈఎస్ఐ, కనీస వేతనం జీవో అమలు పర్చాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మన్న, అయ్యప్ప, రాజు, స్కైలాబ్, నాగప్ప, ఎర్ర అంజప్ప, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

శరీర దారుఢ్యానికి కరాటే శిక్షణ అవసరం


కరాటే విజేతలకు బహుమతులు అందిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : శరీర దారుఢ్యానికి మానసిక వికాసానికి కరాటే శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, భీష్మ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డ్రాగన్ షోటోకాన్ కరాటే స్పోర్ట్స్ ఆధ్వర్యంలో 24వ నేషనల్ కరాటే పోటీలు నిర్వహించారు. అంతకు ముందు కరాటే విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో సలాం ఉమరుద్దీన్, సలీం, అమరేష్, తిమ్మప్ప, గడ్డం తిప్పన్న, సుదర్శన్‌రెడ్డి, నగేష్, సంతోష్, కృష్ణ పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ


ఓబ్లాపూర్‌లో ఇరుముడి కట్టుకుని తరలివెళ్తున్న భక్తులు

మక్తల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం మహాశివపూజ వేడుకలను వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు తిప్పయ్యస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పడమటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మల్లికార్జున స్వామి ఆలయం వరకు పల్లకీసేవ, కలశ ఊరేగింపు, మాలధారుల భజన, ధ్వజస్థాపన, గోమాత, నందిపూజ, అష్ట దిగ్బంధన, కలశ స్థాపన, సాక్షి గణపతిపూజ, కలశ పూజ, జ్యోతిర్లింగాల మహాపూజ, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కట్టసురేష్‌కుమార్‌గుప్తా, గణేష్ కుమార్, బోయ రవికుమార్, నగేష్, భాస్కర్, మహిపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా భక్తులు

ఊట్కూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబ్లాపూర్ చెందిన శివమాల ధారులు ఆదివారం గ్రామం నుంచి పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరారు. గ్రామంలోని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ధన్వాడ: మండల కేంద్రం నుంచి శివమాల ధారులు ఆదివారం గంగామాత ఆలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించి ఇరుముడులు ధరించి పాదయాత్ర బయలు దేరారు. త్రిలోకేశ్వర స్వామి ఆలయం నుంచి భక్తులు బయలుదేరారు. ధన్వాడ భక్త మార్కండేయ ఆలయంలో పూజలు నిర్వహించి ఈరుముడులు ధరించి కుంభమేళకు వెళ్లారు.

శిథిలావస్థలో పురాతన కట్టడాలు

- ఏడు బురుజులను కలిపి నిర్మించిన కోట గోడలు
- కనుమరుగవుతున్న అలనాటి వైభవం


శిథిలావస్థలో బుర్జు గడ్డ


శిథిలమవుతున్న దక్షిణ కమాన్

నర్వ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో 200 ఏళ్ల క్రితం కాకతీయుల కాలం నాటి రాచరిక చరిత్ర కలిగిన పురాతన కట్టడాలు, దిన దినానికి కాల గర్భంలో కలిసి పోతున్నాయి. రాష్ట్ర సంపదలోని ఆనవాలను ప్రస్తుత ప్రభుత్వాలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు. పాలకులు చొరవ చూపి పురాతన కట్టడాలను మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నర్వలో 1800 సంవత్సరంలో ఈ ప్రాంతంలో అశోక చక్రవర్తి కాలంలో నర్వను నడక అనే పేరుతో పిలువబడేదని తెలిసింది. వాడుక భాషలో రానురాను నర్వగా రికార్డుల్లో నమోదైనట్లు చరిత్ర చెబుతుంది. నర్వలో ఏడు బురుజులతో కలిపి విశాలమైన కోట గోడ ఉండగా, కాల క్రమేనా కోట కోడలు, బురుజు గడ్డలు కూలిపోయాయి. ఆ కోట గోడల మట్టితోనే నర్వతో పాటు చుట్టూ పక్కల గ్రామాల్లో పూర్వీకులు మట్టి ఇళ్లను నిర్మించుకున్నారని తెలిసింది. ప్రస్తుతం ప్రధానమైన తూర్పు కమాన్, దక్షిణ కమాన్, బురుజు గడ్డ మాత్రమే మిగిలాయి. తూర్పు కమాన్‌ను 10 ఏళ్ల క్రితం ఒకసారి మరమ్మతు చేయించారు. ఈ కమాన్ వద్ద ప్రతి ఏరువాక పౌర్ణమికి రైతులు కాడెద్దులతో సంబురాలు చేస్తారు. బురుజుమీది దర్గా తాతకు కందూర్లు చేస్తు మొక్కులు తీర్చుకుంటారు.


నర్వలో కాకతీయుల కాలంనాటి తూర్పు కమాన్

కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటా..

- ఎంపీ డీకే అరుణ


మద్దూర్ లో పర్యటిస్తున్న ఎంపీ డీకే అరుణ

మద్దూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో కొడంగల్ గడ్డ పై కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఎంపీ డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో పర్యటించి ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య స్వగృహంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే కార్యకర్తలు కష్టపడి గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం చేయడాలని పిలుపు నిచ్చారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నేనున్నాని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, శంకర్, రాజు, చందుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికులకు సాయం అందించాలి

- టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్


సమావేశమైన వంట కార్మికులు

ఊట్కూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వంట కార్మికులకు ప్రభుత్వం ఆదుకోవాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక రంగాల్లో కార్మికులు పని చేస్తున్నా వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం అందడం లేదన్నారు. ఒక్క ఊట్కూర్ గ్రామంలోనే వంట చేసే వృత్తిపై 500 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ఉన్న గౌరవం కూడా వంట చేసే కార్మికులకు లేదన్నారు. అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు వర్తించేలా బీమా సౌకర్యంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో చెన్నప్ప, వెంకటేష్, మునీర్, సుభాన్, మహమ్మద్, హష్మత్, జమాల్, మహబూబ్, సలీం, బండ రఫీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులకు ఘన సన్మానం


క్రీడాకారులను సన్మానిస్తున్న గోపాలం, సత్య ఆంజనేయులు

మక్తల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గతనెల 7న హైదరాబాద్‌లో షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎంపికల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. జాతీయస్థాయి షూటింగ్‌బాల్ క్రీడలకు 11మంది ఎంపికైనట్లు షూటింగ్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, జిల్లా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు తెలిపారు. ఆదివారం మినీ స్టేడియంలో క్రీడాకారులు గాయత్రి, శ్రీలత, స్వప్న, పరశురాం, జూనియర్ విభాగంలో శ్రావణి, రాజేష్, రఘు, అఖిల, నవ్యను సన్మానించారు. ఈనెల 21 నుంచి 23వరకు నల్గొండ జిల్లాలో జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా షూటింగ్‌బాల్ అధ్యక్షుడిగా ఎంపికైన సత్య ఆంజనేయులును సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీలత, ఓబ్లేష్, శివకుమార్, తిప్పన్న, నర్సింహులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ దశాబ్ది ఉత్సవాలు


మద్దూర్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మద్దూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ దశాబ్ది ఉత్సవాలను మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తర శతనామవాళి, కుంకుమార్చన, పల్లకీ సేవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధ్యక్షుడు కట్కం విజయ్‌కుమార్, కట్కం కృష్ణయ్య, రాజయ్య, రవికుమార్, శ్యాంసుందర్, జగన్నాథం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రికి ఎంఆర్ఐ

- ఈనెల 21న టెండరు దాఖలుకు చివరి అవకాశం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్నాళ్ల నుంచో వేచి చూస్తున్న ఎంఆర్ఐ సేవలు జనరల్ ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా పేద ప్రజలకు ఆర్థిక భారం తగ్గనుంది. ఎంఆర్ఐ యంత్రాన్ని జనరల్ మెడిసిన్ విభాగం వైపు వెనకభాగంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్, ఆయా యంత్రం కంపెనీల ప్రతినిధులు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అయితే యంత్రం కొనుగోలుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఈనెల 21 వరకు టెండరు దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించారు. అన్ని పూర్తయితే మార్చి నెలాఖరు నాటికి ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కాగా ఈ యంత్రం విలువ రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అత్యాధునిక పరిజ్ఞానంతో 3.0 టెస్లా సామర్థ్యం కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే టీఎస్ఎంఎస్ ఐడీసీ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగు తోంది. ప్రస్తుతం ఆయా కంపెనీల ప్రతినిధులు, బిడ్డర్లు టెండర్లు దాఖలు చేశారు. ఈనెల 21 వరకు టెండర్లు దాఖలు చేసేందుకు చివరి తేదీగా నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది.

జనరల్ మెడిసిన్ విభాగం ప్రాంతంలో ఏర్పాటు

ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటు చేయాలంటే దానికి అనుకూలమైన స్థలం ఉండాలి. ఇందు కోసం ముందుగా రేడియాలజీ హబ్‌ను అనుకున్నారు. అంతేకాకుండా ఏర్పాటు కోసం కొన్ని నిర్మాణ పనులు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం ఎంత ఖర్చు అవుతుందనే విషయంపై టీఎస్ఎంఎస్ ఐడీసీ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించారు. కానీ ఖర్చు దాదాపు రూ.1.50కోట్ల వరకు అవుతుండడంతో దాన్ని క్యాన్సల్ చేశారు. మళ్లీ జనరల్ మెడిసిన్ విభాగం ప్రాంతంలో ఓ పెద్ద హాలును చూశారు. ఇందులో ఏర్పాటు చేస్తే ఖర్చు తక్కువ అవుతుందని భావించి అక్కడే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే విప్రో కంపెనీకి చెందిన ప్రతినిధులు, ఇంజనీర్లు వచ్చి స్థలాన్ని కూడా పరిశీలించారు. వారు కూడా అక్కడే ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు.

తీరనున్న ఆర్థిక భారం

ఉమ్మడి జిల్లాల్లో జనరల్ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలు అయినప్పటికీ మెరుగైన వైద్యం కోసం పాలమూరుకే వస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎంఆర్ఐ యంత్రాన్ని ఖచ్చితంగా తేవాలని పట్టుబట్టారు. ఈ మేరకు ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేయించారు. అయితే జనరల్ ఆసుపత్రిలో ఈ యంత్రం అందుబాటులోకి వస్తే నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గుతుంది. బయటి డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఎంఆర్ఐ కోసం రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. జనరల్ ఆసుపత్రిలోకి ఎంఆర్ఐ సేవలు వస్తే ఎంతోమంది నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో అన్ని రకాల యంత్రాలు ఉన్నాయి.